# 6

వర్ధనమ్మకి ఆనందంగా వుంది, కించిత్ గర్వంగా కూడా వుంది. ఇంద్ర భవనంలో వున్నట్టు తోచింది. పరిమళాలు వెదజల్లుతూ గదిలో కదలే ఏ.సి. గాలిని ఆస్వాదిస్తూ గదినంతా మరోసారి చూసింది.

చాలా ఖరీదైన వస్తువులతో, అలంకరించి వుంది ఆగది. నేలమీద, గోడమీద కొంతవరకు పరచిన గ్రానైటు పలకల మీద మోము చూసుకోవచ్చును. ఖరీదైన సోఫాసెట్టులు కిటికీ తెరలు, అందంగా తయ్యారు చేసిన షోకేసు, షోకేసులో అన్నీ వెండి బొమ్మలే!

తన అన్న కొడుకు, గోపాలం, ఇంద్రభవనం లాంటి ఆ ఇల్లు కట్టుకున్నందుకు చాలా సంతోషించింది వర్ధనమ్మ, ఎక్కడో పల్లెటూరులో వున్న నిరుపేద అయిన తనని కారు పంపి ఇంటికి తెచ్చుకున్న గోపాలాన్ని మెచ్చుకుంది. మురిసిపోయింది కూడా. అప్పుడెప్పుడో రెండేళ్ల క్రితం ఈ ఇల్లు కట్టి గృహప్రవేశం చేసినప్పుడు ఏకైక మేనత్త అయిన తనని పిలవలేదని వర్ధనమ్మ బాధపడిన మాట నిజమే. గృహప్రవేశానికి పిలవలేదని బంధువుల దగ్గర స్నేహితురాళ్ల దగ్గర మొర పెట్టుకుంది కూడా.

"నీవు, నేనూ వాడి కళ్లకేంఅనుతామే", ఒక బంధువంది. "కోట్ల మీద సవారి చేసున్నాడు. పాతనేత చీరలు, ఎవరినైనా అడిగి తెచ్చుకొని కట్టుకునేవాళ్లం, మనం వాడి లెవులికి ఏం సరిపోతామే ఒక నిమిషం ఆగి మళ్ళీ అంది, ఆవిడ "ప్రకటనలు తయ్యారు చేసే కంపెనీ పెట్టాడట కదా, డబ్బులే డబ్బులు".

"కావచ్చు, కాని నేనొప్పుకోను, వదినా", వర్ధనమ్మ అంది. "మేనత్తనికదా, ఆ మాత్రం..." అల్లుతున్న ప్లాస్టిక్ సంచినేలమీద పడేసి

లేచి అంది ఆమె "అయినా వాడిని మాత్రం ఏం అంటామే. పెంపకం అటువంటిది. అన్నయ్య కూడా..."

వర్ధనమ్మ అన్నయ్య ఆమెతో పాదరసంలా అంటీ అంటనట్టు వుండేవాడు. మరీ దగ్గరగా ఆప్యాయంగా మసులుతే జలగలా అతుక్కుపోతుందేమోనని భయపడేవాడు. పుట్టుకతో బీదవాడైనా వ్యాపారాలు చేసి బాగా సంపాదించాడు. సంపాదించాక పేదరికంలో వున్న అక్కని కలవాలంటే చికాకుగా వుండేది అతనికి.

ఈ విషయంలో అతని భార్య అతని సహధర్మ చారిణిగా అతని అడుగుజాడలోనే నడిచేది.

"పిన్నిగారు..." ఆ పిలుపుకు ఉలిక్కిపడింది వర్ధనమ్మ, గదిలోకి అడుగుపెడుతోంది గోపాలం భార్య.

"రొంప చేస్తుందే మోనండి పిన్నిగారు, చాలా చల్లగా వుంది. కదా గది" ఏ. సి. ఆపేసి తెరలు జరిపి కిటికీ రెక్కలు తెరిస్తూ... అంది ఆమె.

ఒకేసారిగా ప్రకృతిలోని సహజ వెలుగు వర్ధనమ్మ మోమును తాకింది. సముద్రం, ఎదురుగా కనబడింది.

సముద్రం కనబడగానే ఆమెకు సుందరమ్మ మాటలు గుర్తుకొచ్చాయి.

పట్నం తీసుకురావటానికి పడవలాంటి కారు రాగానే సుందరమ్మ, దగ్గరకి పరుగు తీసింది, ఆమె, కట్టుకోవడానికి మంచి చీరలు లేవు కనుక రెండు నేతచీరలు ఆవిడని అడగాలనేది వర్ధనమ్మ ఉద్దేశ్యం.

చీరలు ఇస్తూ, సుందరమ్మ అంది. "సముద్రం దగ్గర ఇల్లని అన్నావు కదూ. చూడు చుట్టాలు సముద్రం లాంటివాళ్లు. దూరం

నుంచి కాని ఒడ్డున నిలబడి కాని చూస్తే బాగుంటుంది". వర్ధనమ్మ ఏం అనలేదు.

"ఊరితే సంబరపడక, సముద్రంలో బోలెడు నీళ్లుంటాయి. కాని ఏం ప్రయోజనం? ఒళ్లు శుభ్రం చేసుకోలేం, దాహం తీర్చుకోలేం".

సుందరమ్మ మాటలు నిజం కాదని, చుట్టాలు, కనీసం తన చుట్టాలు, ఆవిడ చెప్పినట్టు కాదని ఊరెళ్లగానే చెప్పాలని నిర్ణయించుకుంది వర్ధనమ్మ. ఎంత ఆప్యాయత లేకపోతే కారులో ఇంటికి తెచ్చి, ఇంద్రభవనం లాంటి ఇంటిలో ఒక రోజు వుంచి పట్టుచీర పెడతాడు!

పదహారు సంవత్సరాల తరువాత దూరపు బంధువుల పెళ్లిలో ఆవిడను కలిసాడు గోపాలం, బాగా ఉన్న వాళ్ల ఇంటిలో పెళ్లి, దూరపు చుట్టమైనా వెళ్లటం అందరిని కలిసి వాళ్ల విషయాలు వీళ్లకి వీళ్ల విషయాలు వాళ్లకి అందచెయ్యటం వర్ధనమ్మకి అలవాటు. అందుకే ఆవిడకి సంచారవాణి అనే పేరు కూడా వుంది. ఆవిడ చెవిలో పడిన మాట ఖర్చు లేకుండానే ఊరంతా పాకుతుంది.

"బాగున్నావా, అత్తా.." గోపాలమే పలకరించాడు.

"బాగున్నానురా" వర్ధనమ్మ ఒక నిమిషం ఆగింది. గోపాలం వద్ద నుంచి ఏ మాట రాక పోవటంతో మళ్లీ అంది "మంచి ఇల్లు కట్టుకున్నావట. గృహప్రవేశం కూడా చేసావట.."

"అవునత్తా, అంతా హడావిడిగా జరిగిపోయింది. నీవు మా ఇంటికి రావాలి. మీ ఇంటికి కారు పంపుతానులే.."

మాట తప్పలేదు గోపాలం. కారు పంపాడు. ఇల్లంతా దగ్గర వుండి చూపించాడు. మంచి పట్టుచీర పెట్టాడు.

"కారు రెడీగా వుంది, పిన్నిగారు" గోపాలం భార్య అంది.

ఊరు వెళ్లటానికి సమయమైంది. కుర్చీలో నుంచి లేచింది వర్ధనమ్మ.

"బయలుదేరుతానమ్మా, వాడితో ఒక మాట చెప్పి.."

"నేను చెప్తానులెండి, ఆయన 'బిజీ'గా వున్నారు. ఎవరో వచ్చారు.."

గదిలో నుంచి బయటకు వచ్చింది వర్ధనమ్మ. ఆమెతో గోపాలం భార్య కూడా. మెట్లు దిగి హాలుకు చేరారు. హాలుని అనుకొని వుండే గదిలో కూర్చొని ఎవరితోనో మాట్లాడుతున్నాడు గోపాలం.

వర్ధనమ్మ మనస్సు కొట్టుకుంది, ఒకసారి అతన్ని కలసి బయలదేరుతున్నట్టు చెప్పాలని.

గుమ్మం వైపు నడిచే గోపాలం భార్య వెనుక నడిచింది, ఆవిడ. హఠాత్తుగా మోగింది సెల్‌ఫోన్. సెల్‌ఫోనులో మాట్లాడుతూ, అలా ముందుకు నడిచింది గోపాలం భార్య.

వర్ధనమ్మ మరోసారి చుట్టూ చూసింది. గోపాలానికి చెప్పకుండా వెళ్లటానికి ఆమె మనస్సు ఒప్పుకోలేదు.

గబగబా నడిచి గది తలుపు దగ్గరకు చేరింది, ఆవిడ సంకోచంతో ఒక నిమిషం తలుపు ఇవతల ఆగింది, లోపలనుంచి మాటలు వినబడ్డాయి. "ఏరా, ఊరు నుంచి మీ మేనత్తని కారు పంపిరప్పించావట. ఎప్పటినుంచిరా బంధువుల పట్ల ఈ అభిమానం?"

"అభిమానమా, పాడా?" గోపాలం అన్నాడు "నిన్న మా అమ్మ పోయిన రోజు కదరా, ప్రతి సంవత్సరం ఒక బీదదానికి భోజనం పెట్టి చీర పెడుతున్నానా..."

"అవును.."

"ఈ సారికి ఈవిడని రప్పించాను. ఈవిడకి ఇస్తే పనికట్టుకొని

మరీ వెళ్లి అందరికి చెప్తుందిరా. అస్సలే ఈవిడ సంచారవాణి?"

"ఓహో అలాగా, నిజమైన పబ్లిసిటీకా.. నేనింకా నీవు జాలితో.."

"జాలిలేదు, ఏమీలేదురా, మనం వ్యాపారస్తులం. భూతద్దాలతో కనబడే రాయిని కొండగా చూపే ప్రకటనలు తయ్యారు చేసేవాళ్లం, ప్రచారం చేసే వాళ్లం. ప్రచారం చెయ్యటం మన వృత్తి, పెట్టినడబ్బుకి ఫలితం రావొద్దూ. అందుకే.."

వర్ధనమ్మకు కళ్ళు తిరిగాయి. సుందరమ్మ మాటలు గుర్తుకొచ్చాయి.

లోగుట్టు పెరుమాళ్లకెరుక!